క్లుప్తంగా

గంగానమ్మ తల్లికి శాకంబరీ అలంకారం



పామర్రు: స్థానిక గంగానమ్మ తల్లి ఆలయంలోని అమ్మవారిని ఆషాఢ మాసం చివరి రోజు పురస్కరించుకుని ఆదివారం శాకంబరీ దేవిగా అలంకరించారు. తొలుత ఆలయంలోని అమ్మవారికి 108 బిందెలతో జలాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలతో అలంకరించారు. శాకంబరీ అలంకారాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి, అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు.

ఎస్‌ఐల బదిలీ

గుడివాడరూరల్: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గుడివాడరూరల్, నందివాడ ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. నందివాడ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న చంటిబాబును గుడివాడరూరల్ ఎస్‌ఐగా బదిలీ చేశారు. గుడివాడరూరల్ ఎస్‌ఐగా ఇప్పటిదాకా పని చేసిన ఎస్‌ఎల్‌ఎన్ మూర్తిని వీఆర్‌కు పంపారు. అదేవిధంగా పమిడిముక్కలలో పనిచేస్తున్న కె.శ్రీనివాస్‌ను నందివాడ ఎస్‌ఐగా నియమించారు. వీరిద్దరూ త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

కూచిపూడి ఎస్‌ఐ వీఆర్‌కు..

కూచిపూడి(మొవ్వ): పామర్రు సర్కిల్ పరిధిలోని కూచిపూడి ఎస్‌ఐ టి.శ్రీనివాస్‌ను బదిలీ చేస్తు జిల్లా ఎస్పీ గంగాధరరావు ఉత్తర్వులను జారీ చేశారు. ఎస్‌ఐ శ్రీనివాస్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. నాగాయలంక ఎస్‌ఐ ఎం.సుబ్రమణ్యంను కూచిపూడి ఎస్‌ఐగా నియమించారు.

రోడ్డుపై గుంతలతో అవస్థలు



మండవల్లి: నేషనల్ హైవే (భీమవరం-విజయవాడ) ఆర్అండ్‌బీ రహదారి మండవల్లి వద్ద గుంతలమయంగా మారింది. స్థానిక సెంటర్ నుంచి అగ్రహారం వరకు ఎక్కడ చూసినా రహదారిపై గుంతలు దర్శనమిస్తున్నాయి. స్థానిక ఇండియన్ బ్యాంక్ సమీపంలో కూడా రహదారి దెబ్బతిని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా ఈ రహదారిపై వాహనచోదకులు, ప్రయాణికులు రాకపోకలు సాగించడానికి సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నానా అవస్థలు పడ్డారు. గుంతలు, వర్షం నీటి కారణంగా రోడ్డు ప్రయాణించేందుకు వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా రహదారిని అభివృద్ధి చేసి ప్రజల రహదారి సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

వెలగని వీధి దీపాలు



పామర్రు: స్థానిక కోటిరెడ్డిపేటలో వీధి దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పేటలోని మేనక స్టూడియో ప్రధాన రహదారి వెంబడి వారం రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. వర్షాల సమయంలో రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. దీనితో తోడుగా అక్కడ కుక్కల సంచారం ఎక్కువగా ఉండటం వలన ఎప్పుడు ఏం జరుగుతోందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

7 నుంచి ఆగమన మహోత్సవాలు

పమిడిముక్కల: మంటాడ శ్రీ అలివేలుమంగ పద్మావతీ సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు వార్షిక ఆగమన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మాధవీలత తెలిపారు. బుధవారం మూలవరులకు అష్టోత్తర శత కలశాభిషేకం, గురువారం లక్ష తులసీ పుష్పాలతో అర్చన, శుక్రవారం మూలవరులకు నవ కలశాభిషేకం, మధ్యాహ్నం సమష్టి కల్యాణ మహోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

పెద్దింట్లమ్మకు డీఎన్నార్ పూజలు



కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మకు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పేటేటి పరమేశ్వరరావు ప్రత్యేక పూజలు చేసి ఆయనకు అమ్మవారి ప్రసాదాన్ని అందించారు. నియోజకవర్గ ప్రజలందరికీ పెద్దింట్లమ్మ ఆశీస్సులు ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు డీఎన్నార్ తెలిపారు. అనంతరం అనివేటి మండపాన్ని ఆయన పరిశీలించారు.

పేద విద్యార్థుల చదువులు నిస్తేజం

ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థుల చదువులను కూటమి ప్రభుత్వం నిస్తేజంగా మార్చింది. కైకలూరు, పామర్రు నియోజకవర్గాల్లో టీచర్ల కొరతతో బోధన అంతంతమాత్రంగా సాగుతోంది. పలు పాఠశాలల్లో విద్యా కానుక కిట్ల పంపిణీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో అంతా తారుమారైంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

SAKSHI సాక్షి గ్రౌండ్ రిపోర్ట్ GROUND REPORT

కైకలూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడుస్తున్నా విద్యా విధానంలో పూర్వపు అభివృద్ధి కానరావడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్కూల్ తెరిచిన తొలిరోజే విద్యా కానుక పేరుతో తొమ్మిది రకాల విద్యా సామగ్రి ఉండే కిట్లను విద్యార్థులకు అందించింది. ప్రస్తుతం కిట్ల పంపిణీ పెద్ద ప్రహసనంలా మారింది. విద్యార్థులకు కొలతలకు సరిపడా బూట్లు అనేక పాఠశాలల్లో రాలేదు. వాటిని వాడకుండా మూలనపెట్టారు. మరో వైపు ప్రభుత్వం మారిన తర్వాత వంట ఏజెన్సీలను మార్చాలనే డిమాండ్ వినిపిస్తోంది.

కైకలూరు నియోజకవర్గం నాలుగు మండలాల్లో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలు 234 ఉన్నాయి. వీటిలో 18,464 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత ప్రభుత్వంలో ఒక్క అమ్మఒడి పథకం ద్వారా 24,117 మంది తల్లుల ఖాతాలకు రూ.104,65,56,604 నగదును అందించారు. నేడు విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఇప్పటికీ తల్లికి వందనం పథకం అమలుపై కొత్త ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుతున్నా వారందరికీ రూ.15 వేల చొప్పున అందిస్తామని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల్లో వాగ్దానం చేశారు. ఈ పథకం ఎప్పుడు అమలు చేస్తారోనంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



మండవల్లి ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు



కైకలూరు నిమ్మగడ్డ నాగభూషణం ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు వండిన వంటలు



నందివాడ మండలం లక్ష్మీనరసింహాపురం హైస్కూల్లో భోజనం చేస్తున్న విద్యార్థులు

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

కైకలూరు నియోజకవర్గంలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ఈ ప్రభావం పిల్లల చదువులపై పడింది. కైకలూరు మండలంలో 121, కలిదిండి మండలంలో 119, మండవల్లి మండలంలో 120, ముదినేపల్లి మండలంలో 84 మంది వెరసి స్కూల్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. అదే విధంగా నాలుగు మండలాల్లో మొత్తం 476 మంది ఎస్‌జీటీలు విధులు నిర్వహిస్తున్నారు. మొత్తం మీద 920 మంది ఉన్నారు. నియోజకవర్గం మొత్తం మీద 1,211 మంది ఉపాధ్యాయులు అవసరం కాగా స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు కలపి 291 మంది కొరత ఉంది. ప్రధానంగా సబ్జెక్టు టీచర్ల కొరత వేధిస్తోంది.

టోఫెల్ అమలయ్యేనా?

ఇంగ్లిష్ ప్రావీణ్యం పెంచడానికి గత ప్రభుత్వం టోఫెల్ క్లాసులను ప్రవేశపెట్టింది. ఇందుకోసం ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక క్లాసులను సైతం నిర్వహించింది. పాఠశాలల్లో 3–5 తరగతుల పిల్లల కోసం టోఫెల్ ప్రైమరీ, 6–9 తరగతుల వారి కోసం టోఫెల్ జూనియర్ క్లాసులు నిర్వహించింది. ఈ విధానాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు స్వాగతించారు. నేడు టోఫెల్ విధానాన్ని అమలు చేయబోమనే సంకేతాన్ని ప్రభుత్వం నుంచి కనిపిస్తోంది.

సర్దుబాటు బోధన

ఉద్యోగ విరమణతో 26 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీ

పామర్రు: నియోజకవర్గ పరిధిలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల స్థానంలో ఇక్కడ ఉన్న టీచర్లనే సర్దుబాటు చేసి తరగతులు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న భోజనంలో వినియోగించే బియ్యం రేషన్ బియ్యం కావడంతో పలువురు విద్యార్థులు భోజనం చేసేందుకు వెనుకాడుతున్నారు. కొంత మంది విద్యార్థులు ఈ బియ్యంతో వండిన అన్నం తినడంతో కడుపునొప్పి, అరగక పోవడం తదితర అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. నియోజకవర్గంలో గత రెండు నెలలుగా ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిలో ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి ఆయా పాఠశాలల్లో విద్యాబోధన జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం రిటైర్మెంట్ అయిన ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు 26 ఉన్నాయి. ఈ ఖాళీల్లో ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయులనే సర్దుబాటు చేస్తున్నారు.

అందని పాఠ్యపుస్తకాలు

గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు అరకొరగా పంపిణీ చేయడం వలన విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పుస్తకాల పంపిణీలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలల విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం సిద్ధం చేసేది. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసేవారు. విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందడం వలన ఉపాధ్యాయులకు విద్యను బోధించడం సులభతరంగా ఉండేది. ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితి దయనీయంగా ఉంది. నియోజకవర్గంలోని ఒకటి, రెండు పాఠశాలల్లో మినహా అన్ని చోట్ల ఉపాధ్యాయులు ఉన్నారు. గుడివాడ రూరల్, నందివాడ మండలంలో ఉపాధ్యాయులు కొరత ఉన్నచోట మరో వారం రోజుల్లో సర్దుబాటు చేస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

బెల్లం ద్రావణంతో ప్రయోజనాలు



ముదినేపల్లి రూరల్: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా చేపబెల్లం ద్రావణంతో పలు ప్రయోజనాలున్నట్లు ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ అన్నారు. మండలంలోని సింగరాయ పాలెంలో గ్రోత్ ప్రమోటర్‌గా పిలిచే చేపబెల్లం ద్రావణం తయారీని, ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ ద్రావణాన్ని వరిపైరు ఏపుగా ఎదిగి రోగనిరోధక శక్తిని పెంచుకుని చీడపీడలకు గురికాకుండా ఉంటుందన్నారు. ఈ ద్రావణాన్ని సులభంగా తయారుచేసుకోవచ్చని రైతులకు వివరించారు. తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులకు గ్రోత్ ప్రమోటర్‌గా ఉపయోగపడే చేపబెల్లం ద్రావణాన్ని ప్రతి రైతు ఉపయోగించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఆర్పీ సుధాకర్ పాల్గొన్నారు.

నీటి వృథాను పట్టించుకోని అధికారులు



పెదపూడి(మొవ్వ): తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకునే అధికారులే కరువయ్యారు. మొవ్వ మండల పెదపూడి ఎస్సీ కాలనీలో తాగునీరు పైప్(ఫ్లవర్ పైప్) నుంచి 15 రోజులుగా నీరు లీక్ అవుతోంది. పంచాయతీ అధికారులకు తెలియజేసినా ఫలితం లేదని కాలనీ వాసులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులకు తోడుగా ఉంటా

మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పమిడిముక్కల: మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఎటువంటి కష్టం వచ్చినా తోడుగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ భరోసా ఇచ్చారు. లంకపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు వేమూరి రమేష్, కనుమూరి వెంకటేశ్వరరావును గ్రామంలోని ప్రస్తుత పరిస్థితులు, ఇటీవల వల జరిగిన సంఘటనలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై జరిగిన దాడులను ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి వ్యతిరేకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇకనైనా ప్రజలకు మంచి చేసే విషయాలపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, నాయకులు కొడాలి రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు సజ్జాద్ అలీ, వీర్ల ఆదిశేషు పాల్గొన్నారు.

జంధ్యాల పాపయ్యశాస్త్రికి ఘన నివాళులు



జంధ్యాల పాపయ్యశాస్త్రి పటానికి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

గుడివాడ టౌన్: ప్రముఖ తెలుగుకవి జంధ్యాల పాపయ్య శాస్త్రి జయంతి వేడుకలు తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని శాఖా గ్రంథాలయంలో పాపయ్యశాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కవిగా, పండితుడిగా, విమర్శకుడిగా, వ్యాఖ్యాతగా, సంపాదకుడిగా, బాల సాహిత్య పథకుడిగా, ఉపన్యాసకుడిగా, బహువిధ ప్రతిభామూర్తిగా జీవించిన పాపయ్యశాస్త్రి మొత్తం 76 గ్రంథాలు రచించిన ఘనుడని పేర్కొన్నారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయిని పి. వెంకట శైలజకు జంధ్యాల పాపయ్య శాస్త్రి స్ఫూర్తి పురస్కారం -2024తో సత్కరించారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి, కవి హెచ్.ఆర్.చంద్రం, ఎం.మాధవరావు, ఎస్.సాంబశివరావు, డి.ఆనంద్ మోహన్‌బోస్, ఆర్‌వీఎల్ నరసింహరావు, వసుధ బసవేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, డీఆర్‌బీ ప్రసాదు, దండమూడి సీతారామస్వామి, సీహెచ్. రూప, ఎస్.పద్మజ పాల్గొన్నారు.

దోమల విజృంభణతో జనం బెంబేలు



కనకదుర్గమ్మ కాలనీలోని ఇళ్ల మధ్యలో నిలిచిన మురుగునీరు

తోట్లవల్లూరు: దోమల విజృంభణతో జనం బెంబేలెత్తుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దోమల తీవ్రత పెరగటంతో మండల వ్యాప్తంగా ప్రజలు అల్లాడిపోతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు కాటు వేస్తుండటంతో ఏ వ్యాధుల బారిన పడతామోనని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు, ఖాళీ స్థలాలు, డ్రెయినేజీలలో దోమలు అధికమయ్యాయి. నివాసాల చుట్టూ మురుగు నీరు నిలిచి ఉండటంతో దోమల తీవ్రత పెరిగింది. దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన గ్రామ పంచాయతీలు ఏ మాత్రం పట్టించుకోవటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమ కాటుతో డెంగీ, మలేరియా తదితర జ్వరాలు పొంచి ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటం తగదని అంటున్నారు. పంచాయతీ అధికారులు ఇప్పటికైనా స్పందించి దోమల నివారణ మందు స్ప్రే చేయించటం, మురుగునీరు నిలువ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ విడుదల చేయటం వంటి చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. జిల్లాలోని నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఉదయానికే ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి పుట్టలో పాలు పోయడం మొదలు పాలపొంగళ్ల శాల వద్ద నైవేద్యాలు తయారుచేసేందుకు సైతం భక్తులు పోటీపడ్డారు. పలువురు మహిళా భక్తులు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద గోశాల వద్ద మహిళలు భారీ ఎత్తున పూజలు చేశారు. సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షించారు.

పేకాట, కోడిపందేల శిబిరంపై దాడి

పమిడిముక్కల: మండలలోని గోపువానిపాలెంలో కోడిపందేల శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,020 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. అగినపర్రులో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.3,250 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరపరచనున్నట్లు పేర్కొన్నారు.

మెగా ఉచిత వైద్యశిబిరం



గుడివాడ టౌన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని డాక్టర్ టీఎల్ పెరుమాళ్లు ఆస్పత్రి ప్రాంగణంలో పెద అవుటపల్లికి చెందిన పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె, ఎముకలు, నరాలకు సంబంధించిన వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 100 మందికి సేవలందించినట్లు క్యాంప్ కన్వీనర్ సూర్యచంద్రరావు తెలిపారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు రాజశేఖర్, సెక్రటరీ కిరణ్‌బాబు, కోశాధికారి ప్రసాదు, డాక్టర్ సీహెచ్ లలితకుమారి పాల్గొన్నారు.

మహిళా వైద్యుల సంఖ్య పెరగడం హర్షణీయం

ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్



దత్తాశ్రమంలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు: వైద్య వృత్తిలో మహిళా డాక్టర్ల సంఖ్య పెరగడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. దత్తాశ్రమం, వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లోకుమూడి దత్తాశ్రమంలో విజయవాడ టాప్ స్టార్స్ హాస్పిటల్ వైద్యులతో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దత్తాశ్రమ నిర్వాహకులు గురజాడ ఉదయశంకర్ పర్యవేక్షణలో ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే కామినేని ప్రారంభించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, గుండె, జనరల్ పరీక్షలు 190 మందికి చేసి ఉచిత మందులు అందించారు. డాక్టర్లు అర్చన (కార్డియాలజిస్టు), అపూర్వ (జనరల్ మెడిసిన్), అజయ్‌కుమార్ (కంటి వైద్యులు) సేవలు అందించారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు నిర్వాహకులు భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, గుడివాడకు చెందిన ఇంటర్నేషనల్ వాకర్స్ అసోషియేషన్ కో-ఆర్డినేటర్ లోయ ఈశ్వరరావు, దత్తాశ్రమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దాతల సాయం అభినందనీయం

ఎమ్మెల్సీ జయమంగళ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: పేదలను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. కలిదిండి మండలం సానారుద్రవరంలో ఎస్తేరురాణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం వారికి అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. సంస్థ చైర్మన్ తానికొండ ఎస్తేరు రాణి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అనిల్, సర్పంచ్ నున్న రామచంద్రరావు, కో-ఆపరేటివ్ చైర్మన్ వడ్డాని పార్థసారథి, నాయకులు అబ్రహం, మోహన్, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, చిరంజీవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేరంటాలమ్మ ఆలయంలో భక్తిశ్రద్ధలతో చండీ హోమం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఆదివారం ఆషాఢ మాసం అమావాస్యను పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో చండీ హోమాన్ని నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన ప్రాంగణంలో హోమ గుండాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ హోమాది కార్యక్రమానికి హాజరయ్యారు. అర్చకుల మంత్రోచ్చరణతో హోమాది కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, పాడి, పంటలు సంవృద్ధిగా పండాలన్న ఉద్దేశంతో ఈ హోమం నిర్వహించినట్లు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

హనుమాన్‌జంక్షన్ రూరల్: కాళ్లు, చేతులు పూర్తిగా చచ్చుపడిన పేద మహిళకు వైద్య ఖర్చుల నిమిత్తం స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ అండగా నిల్చింది. స్థానిక ఎన్టీఆర్ నగర్‌కు చెందిన కలిశెట్టి మహాలక్ష్మి ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆమె చేతులు, కాళ్లు పూర్తిగా చచ్చుబడిపోయాయి. వైద్య ఖర్చులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహాలక్ష్మి కుటుంబానికి స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్ తనవంతు సాయాన్ని అందించారు. వైద్యుల సూచనల మేరకు 90 రోజుల పాటు ఫిజియోథెరపీ చేయించాల్సి రావడంతో దానికి అయ్యే ఖర్చును స్రవంతి ట్రస్ట్ అందిస్తుందని సత్యప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆమెకు మొదటి నెల ఫిజియోథెరపీ చికిత్సకు అయ్యే మొత్తాన్ని అందించారు. ట్రస్ట్ సభ్యులు సత్యనారాయణ, భూపతి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తోట్లవల్లూరు: ఇసుకను అక్రమంగా రవాణ చేస్తున్న ట్రాక్టర్ పోలీసులకు పట్టుబడిన ఘటన మండలంలోని భద్రిరాజుపాలెంలో జరిగింది. తోట్లవల్లూరు గ్రామానికి చెందిన డొక్కు భార్గవ్, గొరిపర్తి గోపీకృష్ణ భద్రిరాజుపాలెం నుంచి ట్రాక్టర్‌పై ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఆదివారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్‌ఐ పి.విశ్వనాథ్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణ చేస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, డొక్కు భార్గవ్, గొరిపర్తి గోపీకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

కైకలూరు: అనుమానంతో భర్త వేధిస్తున్నాడంటూ ఓ మహిళ కైకలూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు భుజబలపట్నం గ్రామానికి చెందిన సుజాతకు 2015లో అదే గ్రామానికి చెందిన పాల్‌రాజ్‌తో ప్రేమ వివాహం జరిగింది. వీరికి బాబు, పాప సంతానం. ఇటీవల తనను అనుమానంతో వేధిస్తున్నాడంటూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

చౌడేశ్వరీదేవికి ఆషాఢ సారె

ఉయ్యూరు: మండలంలోని ముదునూరులో ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ఆషాఢ ఉత్సవాలను నిర్వహించారు. ఆలయంలో వేంచేసిన చౌడేశ్వరీ దేవికి భక్తులు ఆషాఢ సారె సమర్పించి పూజలు చేశారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



పామర్రులో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకుంటున్న పూర్వ విద్యార్థులు

పామర్రు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో 1981–82వ సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ ఫొటో స్టూడియో వద్ద కేక్‌ను కట్ చేసి ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారు. కార్యక్రమంలో 10వ తరగతి పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు నూతలపాటి త్రివిక్రమరావు, కార్యదర్శి మేడిపల్లి వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.